క్లుప్తంగా

భోజనంలో మెనూ పాటించాలి

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్సీ హాస్టల్‌ను విద్యార్థులను లోపల ఉంచి హాస్టల్ సిబ్బంది తాళం వేసుకొని వెళ్లారని ఆ సమయంలో విద్యార్థులకు ఆరోగ్య సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. భోజనంలో మెనూ సక్రమంగా పాటించడం లేదన్నారు. అందుబాటులో లేని హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, సీఐటీయూ మండల కార్యదర్శి మహబూబ్‌ఖాన్, మండలాధ్యక్షుడు తిప్పేస్వామి పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలిసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సుప్రభాత సేవ పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో సమీప కర్ణాటక ప్రాంతం నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రసాద వినియోగం చేశారు.

రంగనాథ స్వామి విగ్రహ ప్రతిష్ట


పూజలందుకుంటున రంగనాథస్వామి

పావగడ: స్థానిక విజయనగర లే అవుట్‌లోని రంగనాథస్వామి ఆలయంలో రంగనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. మర్రిమాను తోట ముద్దరంగ నాయక వంశస్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద బ్రహ్మశ్రీ అనంత రాంభట్ స్వామి నేతృత్వంలో మూడు రోజులుగా ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, మాజీ జెడ్పీ సభ్యుడు హెచ్ వి వెంకటేశ్ తదితర ప్రముఖులు హాజరై స్వామికి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన


పూలరథంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరిప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు చేపట్టారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతరంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చి పూజలు చేసి భక్తులు గోవిందా నమస్మరణ చేస్తూ గిరి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకుడు గోవిందశర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఖాద్రీ


శ్రీవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం సోమవారం జరగనుంది. బ్రహ్మరథంపై కొలువుదీరే శ్రీవారిని దర్శించుకునేందుకు ఆదివారమే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా కదిరికి చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు పురవీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలో నారసింహుడి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఇంకా పలుచోట్ల నాటకాలు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి స్వామి తిరువీధుల్లో ఐరావతంపై దర్శనమిచ్చారు.

పేదల పార్టీ వైఎస్సార్‌సీపీ


మడకశిర: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


పెనుకొండ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ


హిందూపురం: కేక్ కట్ చేస్తున్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు

- ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, మాలగుండ్ల శంకరనారాయణ

మడకశిర: వైఎస్సార్‌సీపీ పేదల కోసం పుట్టిన పార్టీ అని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సఫలీకృతులయ్యారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారని తెలిపారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏరాష్ట్రంలో లేవని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా నేరుగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా వైఎస్సార్‌సీపీ 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందన్నారు. ప్రజలు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ వైపే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసు కుని పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, మాజీ ఎంపీపీ బజ్జప్ప, డైరెక్టర్ నాగరాజగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, జయరాజ్, సతీష్ ,గోపి, తిమ్మప్ప, నాగభూషణ్‌రెడ్డి, రాజశేఖర్, అంజలి, శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

పెనుకొండ: పేదల గుండె చప్పుడు నుంచి ఉద్భవించిన పార్టీ అని, ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జెండా ఎగురవేసి, పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అంతకుముందు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పెద్దపీట వేశారన్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలకు అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీత, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు తయూబ్, రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, రామాంజనేయులు, సద్దాం, శేషాద్రి, ముఖ్యనాయకులు యాసిన్, బోయబాబు, తిమ్మారెడ్డి, శ్రీరాములు, మారుతి, గణేష్, ఫరీద్, క్రిష్ణ, కిరణ్, ఇస్లాపురం గోపాల్, తిరుపాల్‌నాయక్, నారాయణ, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో ప్రజాసంక్షేమ పాలన

హిందూపురం: వైఎస్సార్‌సీపీతో రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన ఆరంభమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో జెండాను ఎగురవేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా, అజెండా అన్నారు. పేదల కష్టలు తొలగించి సంక్షేమపాలన అందించాలనే లక్ష్యంతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించారన్నారు. హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు లోకేష్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్రబాబు, ఆయూబ్, ముస్తక్, మల్లికార్జున, రహమత్‌బీ, నాగేంద్రమ్మ, రోషన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి,బసిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఇలియాజ్, చంద్‌బాషా, శివశంకర్‌రెడ్డి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చౌళూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, నాయకులు నాగభూషణరెడ్డి, నారాయణరెడ్డి, తిమ్మరెడ్డి, అనిల్, లోకేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, సర్పంచ్‌లు ఆదినారాయణ, అశ్వర్థనారాయణ, మంజునాథ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శంకరప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, తిప్పన్న, శంకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

పరిగి:మండలంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా జరిపారు. పరిగిలో వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత ప్రభాకర్ ఆద్వర్యంలో కేక్ కట్ చేసి, అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ బీకే నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, కోఆప్షన్ మెంబర్ సలీం, సర్పంచులు లక్ష్మీదేవి, మంజునాథరెడ్డి, దిలీప్, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ, లింగమ్మ, అమరావతి, మారుతీరెడ్డి, రామాంజి, చిక్కన్న, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, మాజీ కన్వీనర్ జయరాం, ఎస్సీ, బీసీ, మహిళా విభాగాల మండల నాయకులు శంకర్, చిరంజీవి, పద్మ, చేనేత విభాగం పార్లమెంటరీ కార్యదర్శి బీఆర్ నారాయణ, చంద్రారెడ్డి, సింగారెడ్డి, కేటీ అశ్వర్థప్ప, మైనార్టీ నాయకులు రఫీక్, ఇర్షాద్, షబ్బీర్, ఆల్తాఫ్, మాజీ ఎంపీపీ గోవిందప్ప, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, రొద్దం, కలిపి సింగిల్ విండో ఛైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ రాజారెడ్డి, స్థానిక సర్పంచ్ రూప, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, సింగిల్ విండో చైర్మన్లు ఆదినారాయణ, కొల్లప్ప, సర్పంచులు సోము, రామాంజనేయులు, వైస్ సర్పంచ్ వేణు, నాయకులు ఎల్లారెడ్డి, నరసింహమూర్తి, లక్ష్మీనరసప్ప, ఇమాంవలి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: గోరంట్ల పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, పట్టణ కన్వీనర్ ధనారెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, నాగేనాయక్, మేదర శంకర్, సచివాలయ మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, మల్లికార్జున రెడ్డి, నారాయణ రెడ్డి, తులసి కుమార్, వీరానారాయణ రెడ్డి, సత్యనారాయణ, మిక్చర్ కృష్ణారెడ్డి, సాయి, శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


హిందూపురం: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి


గ్యారంటీ కార్డులు అందిస్తున్న వెంకటేశ్

పావగడ: సంచారి జాతులకు చెందిన బుడబుడకల వారు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని స్థానిక కాంగ్రెస్ యువ నేత హెచ్ వి వెంకటేశ్ సూచించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు వద్ద కొండ ప్రాంతంలో ఉన్న బుడుబుడుకుల వారితో ఆదివారం సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే ప్రతి మహిళకు రూ.2 వేలు ఆర్థిక సాయం ప్రతి నెలా అందించడంతో పాటు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తారన్నారు. అలాగే 10 కేజీల బియ్యం అందిస్తారన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప మాట్లాడుతూ మీ సమాజం పూజించే దేవుడి ఆలయానికి ఇప్పటికే రూ.5 లక్షలు అనుదానం అందించానన్నారు. రాబోయే రోజుల్లో ఇళ్లు నిర్మిస్తామన్నారు. వచ్చే స్థానిక విధాన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు సుదేశ్ బాబు, డా చక్కరరెడ్డి, మహ్మద్ ఫజులుల్లా తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలి



క్రైస్తవ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: క్రైస్తవ సంఘాలు సమాజ సేవ, దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ గద్దపాటి విజయరాజు, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ అప్పికట్ల జాకబ్ శామ్యూల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో పట్టణంలోని క్రైస్తవ సంఘాల పెద్దలు, పాస్టర్ ఫెలోషిప్స్ మెంబర్లు, పలు చర్చిల సభ్యులతో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ రెవరెండ్ స్టీఫన్ రాజ్, ఏఐసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ట్రెజరర్ ఆదర్శ్ కుమార్, జాయింట్ సెక్రటరీ క్రిస్టఫర్, జాయింట్ ట్రెజరర్ ఆనంద్ రాజ్, డీకెన్ మెంబర్లు విక్టర్ జాషువా, జాన్సన్, జార్జ్ బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి తరలింపు


ఎన్నికల సామగ్రి తరలిస్తున్న దృశ్యం

హిందూపురం: ఎమ్మెల్సీ పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ కోసం హిందూపురం నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, హిందూపురం మండలంలోని ఓటర్లకు స్థానిక ఎంజీఎం హైస్కూల్‌లో ఏడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సౌజన్య తెలిపారు. ఇందులో పట్టభద్రులకు ఆరు పోలింగ్ కేంద్రాలు, టీచర్లకు ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేశామన్నారు. ఎంజీఎం హైస్కూల్‌లో వరుసగా 206 నుంచి 211 వరకు ఆరు పోలింగ్ కేంద్రాలు వరుసగా 17,19,21,23,26,27 రూం నెంబలో కేటాయించారు. టీచర్స్ ఓటర్లకు రూం నెంబర్ 15లో 99 నెంబర్ పోలింగ్ కేంద్రం కేటాయించారు. అలాగే లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో పట్టభద్రులకు బూత్‌నెంబర్ 100గా ఒక కేంద్రం, 212 పోలింగ్ కేంద్రం టీచర్స్ ఓటర్లకు ఏర్పాటు చేశారు. చిలమత్తూరులో పాట్టిశ్రీరాములు జెడ్పీ హైస్కూల్‌లో 213 పోలింగ్ బూత్ పట్టభద్రుల ఓటర్లకు, 101పోలింగ్‌బూత్ టీచర్లకు కేటాయిస్తూ ఏర్పాట్లు చేశారు.


బందోబస్తు పర్యవేక్షిస్తున్న పోలీసులు

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 8 నుంచి సాయంకాలం 4 గంటల వరకు పోలింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

మడకశిర: నియోజకవర్గంలో సోమవారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగునున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పట్టభద్రులకు 6 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. మడకశిరలో 2 ,రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండల కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా టీచర్లకు 5 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండల కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు 4,108 ఉండగా టీచర్ల ఓటర్లు 210 మంది ఉన్నారు. ఇందులో పట్టభద్రుల పురుష ఓటర్లు 3,017, మహిళా ఓటర్లు 1,091 ఉన్నాయి. అదే విధంగా టీచర్ల పురుష ఓటర్లు 160 ఉండగా మహిళా ఓటర్లు 60 ఉన్నాయి.

లేపాక్షి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం జరుగునున్న నేపథ్యంలో లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ఆదివారం అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు. 212వ పోలింగ్ బూత్‌లో పట్టభద్రులు, 100వ పోలింగ్ బూత్‌లో ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ బాబు సూచించారు. మండలంలో 566 మంది పట్టభద్రులు, 35 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య కేంద్రం, తాగునీటి సౌకర్యం, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు.

రొద్దం: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ అనంతచారి తెలిపారు. ఆదివారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు సిబ్బంది చేరుకున్నట్లు వివరించారు.


అమరాపురంలో పోలింగ్ కేంద్రం వద్ద బారికేడ్లు

పటిష్ట బందోబస్తు

నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సజావుగా జరపడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. ఈఎన్నికలను ప్రశాంతంగా జరపడానికి రాజకీయ పార్టీలన్నీ సహకరించాలి. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనల పాటించాలి.

-సీఐ సురేష్‌బాబు

మడకశిర నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు

మండలం	మొత్తం పట్టభద్రులు	మొత్తం టీచర్లు
మడకశిర	1,483	115
అమరాపురం	1,145	50
గుడిబండ	632	21
రొళ్ళ	392	22
అగళి	456	02
మొత్తం	4,108	210

ఏర్పాట్లు పూర్తి

పెనుకొండ: పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో 1,660 మంది పట్టభద్రులు, 96 మంది టీచర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఓటు సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్



హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు సద్వినియోగం చేసుకుని వందశాతం పోలింగ్ జరిగేలా సహకరించాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కోరారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి జరిగే పోలింగ్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మేధావులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు వేయాలన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ప్రతి పాఠశాలనూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చేసిందని, తనవంతుగా అవసరమైన మౌలిక సదుపాయలు, క్రీడా పరికరాల అందజేత, ఉపాధ్యాయులకు వసతులు కల్పించామన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులు, పట్టభద్రులకు మరింత అందుబాటులో ఉండి సహకారం అందిస్తామన్నారు.

వైద్యశిబిరం

పరిగి: ఎర్రగుంటలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ముబారక్ హెల్త్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ బాలకృష్ణ ప్రారంభించారు. డాక్టర్లు నాగరాజు, ఇమ్రాన్‌ఖాన్, షాహీద్ నేతృత్వంలో మొత్తం 210 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, సర్పంచ్‌లు మంజునాథ్‌రెడ్డి, దిలీప్, స్థానికులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి


పట్టుబడిన జూదరులను చూపుతున్న పోలీసులు

రొద్దం: ఆర్‌ఎల్ కొత్తూరు సమీపంలోని కంపచెట్లలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో పదిమంది జూదర్లు పట్టుబడినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. వారినుంచి రూ.58,140 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో హెడ్‌కానిస్టేబుళ్లు కాంతప్ప, నాగరాజు, కానిస్టేబుళ్లు పోతిరెడ్డి, హనుమంతరాయుడు, శ్రీనివాసులు, అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లిలో హరిజన తిప్పన్నకు చెందిన గడ్డివామి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఆరు ట్రాక్టర్ల గడ్డి వామి కాలిపోయింది. దాదాపు రూ.30 వేలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

కె.మరువపల్లిలో ఘర్షణ



చికిత్స పొందుతున్న ధనుంజయ, శివ

రొద్దం: మండలంలోని కే మరువపల్లిలో రెండు వర్గాల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. శనివారం రాత్రి సర్కస్ ప్రదర్శన ఉండగా, అదే సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఒకరిపై మరొకరు భౌతిక దాడులకు దిగారు. ఈ దాడిలో శివ, ధనుంజయ్యకు గాయలయ్యాయి. దాడి చేసిన మనోజ్, నాగరాజు, కస్సప్పపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. కాగా కె.మరువపల్లిలో ఆదివారం సాయంత్రం మళ్లీ ఘర్షణ జరిగిందని ఎస్ఐ నాగస్వామి తెలిపారు. గాయపడిన వారిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ గాద్రాళపల్లి వద్ద శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ బ్రహ్మేశ్వరంపల్లికి చెందిన రవీంద్రారెడ్డి(62) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రోడ్డుపై వస్తున్న బస్సును గమనించకుండా.. అడ్డంగా వెళ్లడంతో బస్సు ఢీకొన్న పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.